సాక్షి
కాకినాడ

బుధవారం | 3 | జూలై | 2024



అన్నదానానికి విరాళం


బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుర్రా రామలక్ష్మి మంగళవారం రూ.82,700 విరాళం అందజేశారు.



సత్యదేవుని సన్నిధిలో రూ.1,00,116

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఆకెళ్ల యశోద (హైదరాబాద్) మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 11,620 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 11,620 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,600, మధ్య డెల్టాకు 2,020 పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. సముద్రంలోకి 22,624 క్యూసెక్కుల మిగులు జలాలు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాల అమలును నిరసిస్తూ కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వర రావు, చెక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ, నూతన చట్టాలు లోపభూయిష్టంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. తక్షణమే కొత్త చట్టాలను నిలుపు చేయాలని డిమాండ్ చేశారు.

ఓడలరేవుకు పొంచి ఉన్న ప్రమాదం

అల్లవరం: మండలంలోని ఓడలరేవు తీరం భారీ అలల తాకిడితో కోతకు గురవుతోందని, దీనివల్ల ఆ గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. ఓడలరేవులోని ఓఎన్‌జీసీ టెర్మినల్ రక్షణ గోడ వద్ద కెరటాల తాకిడితో కోతకు గురైన ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా ఏర్పడుతున్న తుపానుల ప్రభావంతో భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడి తీరం కోతకు గురవుతోందన్నారు. తీరానికి రక్షణగా ఉన్న సరుగుడు తోటలను నరికివేయడంతో వేరు వ్యవస్థ పాడై ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలిపారు. ఇలాగే సాగితే సముద్రం ముందుకు వచ్చి ఓఎన్‌జీసీ టెర్మినల్‌ను, గ్రామాన్ని సైతం ముంచెత్తడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ఓఎన్‌జీసీ రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రేపు విద్యా సంస్థల బంద్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ సంయుక్తంగా గురువారం దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ పోస్టర్లను పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, ఎ.తారకేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్‌లు స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, దేశంలో ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్ష చరిత్రలో ఏనాడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని దుయ్యబట్టారు. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని బాధిత విద్యార్థులు మొర పెట్టుకున్నా కేంద్ర మంత్రి స్పందించకపోవడం విచారకరమని విమర్శించారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని కానీ, నీట్ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని కానీ చెప్పకపోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీలకు కారణమైన ఎన్‌టీఏని రద్దు చేయాలని, నష్టపోయిన విద్యార్థులకు పరిహారం చెల్లించాలని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలన్నారు. ఆయా డిమాండ్లపై గురువారం చేపడుతున్న బంద్‌కు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

అతిసారపై అస్త్రం

- జిల్లాలో ప్రారంభమైన 'స్టాప్ డయేరియా'
- జిల్లాలో 1.47 లక్షల మంది చిన్నారులకు మేలు
- శిశు మరణాల నియంత్రణే లక్ష్యం
- రెండు నెలల్లో మూడు దశల్లో కార్యక్రమం

కాకినాడ క్రైం: బాల్యం అతిసార బారిన పడి ప్రమాదపుటంచులకు చేరువవుతోంది. ఏటా బాలల్లో 5.8 శాతం మరణాలు అతిసార వల్లనే సంభవిస్తున్నాయని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అయితే జిల్లాల స్థాయిలోనూ ఈ ప్రమాదం పొంచి ఉందని జాతీయ ఆరోగ్య నివేదికలు రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. తాజాగా జిల్లాలోని తొండంగి మండలం కొమ్మనాపల్లి, బెండపూడి, సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామాల్లో అతిసార ప్రబలి వందలాది మంది ఆసుపత్రి పాలవడం, ఒకరు మృతి చెందడంతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. బాలల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించింది.

మూడు దశల్లో..

కలెక్టర్ నేరుగా పర్యవేక్షిస్తున్న స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకూ రెండు నెలల పాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం మూడు దశల్లో జరగనుంది. ఈ నెల 1 నుంచి 14వ తేదీ వరకూ తొలి దశ, 15 నుంచి వచ్చే నెల 16 వరకూ రెండో దశ, ఆగస్టు 17 నుంచి 31వ తేదీ వరకూ మూడో దశగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.



కాకినాడ రెవెన్యూ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న సిబ్బంది

ఇకపై రెండు నెలలు

జాతీయ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో ఏటా 15 రోజుల పాటు ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాం(ఐడీసీపీ)గా మార్చారు. దీనినే స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024గా పిలుస్తున్నారు. పెరుగుతున్న కేసులు, ప్రభావితమవుతున్న బాలల భద్రత కోసం ఏటా రెండు నెలల పాటు ఏడు శాఖలు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళ, శిశు సంక్షేమ శాఖ, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ విభాగం, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు, విద్యా శాఖ, ఆహార భద్రతా విభాగాలు సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తాయి.

ఏ శాఖలు ఏం చేస్తాయి

ఈ ఏడు శాఖలకు ప్రత్యేక కార్యకలాపాలు కేటాయించారు. ఆరోగ్య శాఖ ప్రచార బాధ్యతలు, అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు చేపడుతుంది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారు. ఒక రోజు ప్రతి ఆరోగ్య కేంద్రం వద్ద చేతి శుభ్రత, ఓఆర్ఎస్ తయారీ ప్రాధాన్యంపై కనీసం రెండు సెషన్లు నిర్వహిస్తారు. ప్రతి బుధవారం ఎంఎల్‌హెచ్‌పీలు నీటి నాణ్యతను పరిశీలించి అనుమానం వస్తే పంచాయతీరాజ్ శాఖకు సమాచారం ఇస్తారు. మహిళా, శిశు విభాగం గ్రోత్ మానిటరింగ్, న్యూట్రీషియన్ అసెస్‌మెంట్, హ్యాండ్‌వాష్ టెక్నిక్స్, పోషకాహార లోప బాలలను గుర్తించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేస్తారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వద్ద నీటి నాణ్యత పరీక్షకు తగిన ఏర్పాట్లు చేస్తారు. అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచి క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయిస్తారు. పైప్ లైన్లలో లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించడం తాగునీరు, పారిశుద్ధ్య విభాగం పని. ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు, మరుగుదొడ్ల శుభ్రత, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపును పట్టణాభివృద్ధి విభాగం పరిశీలిస్తుంది. గతంలో అతిసార విజృంభించిన ప్రాంతాలు, తాగునీటి సరఫరాను పంచాయతీరాజ్ చేపడుతుంది. పాఠశాలలో క్లీన్ అండ్ ఫంక్షనల్ టాయిలెట్ల నిర్వహణ, నీటి ట్యాంకుల లభ్యత, శుభ్రతను పర్యవేక్షించడం, ఆరోగ్య భద్రత, అతిసార నివారణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించడం, ఆరోగ్య విద్యపై ప్రత్యేక తరగతులు నిర్వహించడం విద్యా శాఖ విధి. అలాగే, అతిసార విజృంభిస్తున్న ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య శాఖ సమన్వయంతో నీరు, ఆహార కాలుష్యాన్ని గుర్తించేందుకు నమూనాలు సేకరించడం, పరీక్షలకు పంపి వాస్తవ నివేదికల ఆధారంగా తగిన చర్యలకు సిఫారసు చేయడాన్ని ఆహార భద్రత విభాగం నిర్వర్తిస్తుంది.

ఇలా రక్షణ

రెండు నెలల లోపు వయసున్న పిల్లల్లో అతిసార నివారణకు ఎటువంటి ద్రావణాలూ ఇవ్వరు. వారు తల్లిపాల మీద ఆధారపడి ఉండటమే దీనికి కారణం. తల్లిపాలు తాగే బిడ్డకు ఏమీ కాదన్నది శాస్త్రీయ నిరూపణ. రెండు నుంచి ఆరు నెలల మధ్య వయసున్న వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇస్తారు. ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఓఆర్ఎస్‌తో పాటు 20 గ్రాముల జింక్ మాత్రలను 14 రోజుల పాటు ఇస్తారు.



చేతులు కడిగే శాస్త్రీయ విధానాన్ని వివరిస్తున్న తూరంగి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక

జిల్లాలో 2 నెలల లోపు వయసు శిశువులు - 4,320

2-6 నెలల లోపు శిశువులు - 7,683

6 నెలల నుంచి ఐదేళ్ల లోపు బాలలు - 1,34,375

'స్టాప్ డయేరియా'తో లబ్ధి పొందనున్న బాలలు - 1,46,378

కార్యక్రమం ప్రారంభం ఈ నెల 1
ముగింపు వచ్చే నెల 31



స్టాప్ డయేరియా ప్రచారాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ, అధికారులు

బాలల్లో అతిసార మరణాల నివారణే లక్ష్యం



కలెక్టర్ షాన్ మోహన్, డీఎంహెచ్ఓ నరసింహ నాయక్‌ల ఆధ్వర్యంలో జిల్లాలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఈ నెల 1న లాంఛనంగా ప్రారంభించాం. క్షేత్ర స్థాయి సిబ్బందే కార్యక్రమ నిర్వహణలో కీలకం. దశల వారీగా ఈ కార్యక్రమం చేపడుతున్నాం. బాలల్లో అతిసార మరణాల నివారణే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ఆరోగ్య సిబ్బంది అందించే ఓఆర్ఎస్‌లు, జింక్ మాత్రలపై అపోహలు వద్దు. తల్లిదండ్రులు అతిసార రహిత సమాజాన్ని నిర్మించి, తమ బిడ్డల ఆరోగ్య భద్రతకు సహకారం అందించాలి.

– డాక్టర్ కె.రత్నకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, చైల్డ్ హెల్త్ ఆఫీసర్, కాకినాడ

ఇలా చేస్తే మేలు

అతిసార బారిన పడకుండా చంటిపిల్లల్ని కంటికి రెప్పలా కాచుకోవాలి. అందుకు నిపుణులు సూచించిన కీలక అంశాలివీ..

- సురక్షిత తాగునీరు.
- మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ.
- చేతులను సబ్బు లేదా నీటితో కడగడం.
- పోషకాహారం, తల్లిపాలు.
- వ్యక్తిగత శుభ్రత, ఆహార పరిశుభ్రత.
- ఇన్ఫెక్షన్ నివారణ చర్యలు, టీకాలు సకాలంలో వేయించడం.
- ఓఆర్ఎస్, జింక్‌తో ప్రాథమిక చికిత్స అందించడం.

అభివృద్ధికి నిధులివ్వండి

- వివిధ పనులకు అవసరం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించిన అధికారులు

కాకినాడ సిటీ: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు అవసరమని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి పవన్ కల్యాణ్‌కు జిల్లా అధికారులు వివరించారు. ఆయా శాఖల శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ, ఆయా శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, చేపట్టిన పనులు, వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల గురించి వివరించాలని అధికారులకు సూచించారు.

- జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.203 కోట్ల జెడ్పీ సాధారణ నిధులతో 472 పనులు చేపట్టగా రూ.121 కోట్లతో 281 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 191 పనులకు రూ.91.77 కోట్లు అవసరమని తెలిపారు. కాకినాడ జిల్లాలోని మండల పరిషత్‌లలో రూ.4.39 కోట్ల సాధారణ నిధులతో 269 పనులు చేపట్టగా రూ.2.35 కోట్లతో 233 పనులు పూర్తి చేశామని, మిగిలిన 31 పనులకు రూ.85.45 లక్షలు అవసరమని వివరించారు. 2019–21లో జిల్లాలో వసూలు చేసిన సుమారు రూ.101 కోట్ల ఇసుక సీనరేజిలో రూ.16.31 కోట్లు జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీలకు జమ చేయలేదన్నారు. జిల్లాలో ఒక జెడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు.



సమీక్షలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

- జిల్లాలోని నీటి సరఫరా పథకాల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. సీపీడబ్ల్యూ స్కీముల నిర్వహణకు ఏడాదికి రూ.16.83 కోట్లు అవసరమన్నారు. పాత స్కీముల్లో పరికరాల మార్పునకు రూ.5.93 కోట్లు, ఫిల్టర్ శాండ్ మార్చేందుకు రూ.6 కోట్లు కావాలని చెప్పారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో రూ.408 కోట్లతో 874 పనులు చేపట్టామని, ఇంటింటా 3.89 లక్షల కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఏప్రిల్ నెలాఖరుకు 3.15 లక్షలు ఏర్పాటు చేశామని తెలిపారు. పిఠాపురం సీపీడబ్ల్యూ స్కీము కింద పిఠాపురం – రాపర్తి మధ్య హైవే అభివృద్ధి పనుల వల్ల పైపులైన్లు దెబ్బ తిని, 17 ఆవాసాలకు నీటి సరఫరాలో సమస్య తలెత్తిందని, యు.కొత్తపల్లి మండలంలో నాగులాపల్లి సీపీడబ్ల్యూ స్కీముకు 20 ఎకరాల మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ నీటిని సేకరించాల్సి ఉందని తెలిపారు.
- గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ సిబ్బంది జీతాలకే సరిపోనందున, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణకు తగిన ఆదాయ వనరులు ఉండటం లేదని, అందువలన 15వ ఆర్థిక సంఘం నిధులను దీనికి మళ్లించామని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య చెప్పారు. జిల్లాలో 10 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు ప్రతిపాదించినందున వాటికి ఎన్నికలు జరగలేదని కలెక్టర్ చెప్పారు.

జిల్లాలో ఈ ఏడాది అడవుల అభివృద్ధికి రూ.9.92 కోట్లు కేటాయించారని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. జీవజాతుల పరిరక్షణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. పర్యావరణంపై ప్రభావం లేకుండా హోప్ ఐలాండ్‌ను ఎకో టూరిస్ట్ ఆకర్షణగా అభివృద్ధికి ప్రతిపాదించాలని అన్నారు. సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేవీకేకి చేరిన స్వర్ణోత్సవ జ్యోతి



సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ నుంచి స్వర్ణోత్సవ జ్యోతిని అందుకుంటున్న పందిరిమామిడి కేవీకే ప్రధానాధికారి లలితా కామేశ్వరి

రాజానగరం: మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో కేవీకే స్వర్ణోత్సవ జ్యోతి వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. విశాఖపట్నం కొండెంపూడిలోని కేవీకే నుంచి స్వర్ణోత్సవ జ్యోతిని రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ సోమవారం అందుకుని, కలవచర్ల కేవీకేకి తీసుకుని వచ్చారు. ఆయన నుంచి ఆ జ్యోతిని అల్లూరి సీతారామరాజు జిల్లా పందిరిమామిడి కేవీకే ప్రధానాధికారి డాక్టర్ లలితా కామేశ్వరి అందుకున్నారు. పందిరిమామిడి కేవీకే నుంచి స్వర్ణోత్సవ జ్యోతి ప్రయాణం బుధవారం కొనసాగుతుంది. ఈ ఏడాదిని కృషి విజ్ఞాన కేంద్రాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా కేవీకే స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. దేశంలో వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూర్చి, మంచి దిగుబడులు సాధించే దిశగా కేవీకేలను 1974 మార్చి 21న ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 731 కేవీకేలు పని చేస్తున్నాయి. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), సీటీఆర్ఐ ఆధ్వర్యంలో 1983లో కలవచర్లలో కేవీకే ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నాలుగు దశాబ్దాలుగా రైతులకు విశిష్ట సేవలందిస్తూ రైతులు, రైతు మహిళలు, గిరిజనులు, విస్తరణ సిబ్బందికి, విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తూ వచ్చింది. స్వర్ణోత్సవ జ్యోతి వచ్చిన సందర్భంగా జిల్లా ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యాన భూసార పరీక్ష కార్డుల పంపిణీ, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కలవచర్ల కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ఆత్మ పీడీ డాక్టర్ వై.జ్యోతిర్మయి, ఏడీఏ డాక్టర్ జయరామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుకు వేళాయె..

- డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఈనెల 10 వరకూ అవకాశం
- 22 నుంచి తరగతుల ప్రారంభం

రాయవరం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలోని రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరుల్లో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,800 వరకు సీట్ల భర్తీకి అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాలలు

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	అటానమస్
కోనసీమ	07	45	01
తూర్పుగోదావరి	06	40	01
కాకినాడ	05	46	03

షెడ్యూల్ ఇదే..

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం మొదలైంది. ఈ నెల 10వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ ఉంటుంది. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ / సీఏసీ / ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ / ఎన్‌సీసీ / గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్లు ఆయా యూనివర్సిటీలలో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. ఈ నెల 5న ఓపెనింగ్ ఆఫ్ హెచ్ఎల్‌సీ ఫర్ వెరిఫికేషన్ ఆఫ్ సర్టిఫికెట్స్ ఉంటుంది. రాజమహేంద్రవరం, కాకినాడల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కోర్సులను ఎంపిక చేసుకోవడం కోసం ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. ఈ నెల 19న సీట్లు కేటాయించి, అలాట్ అయిన విద్యార్థులు ఎంపికైన కళాశాలల్లో ఈ నెల 20 నుంచి 22వ తేదీలోగా రిపోర్ట్ చేయాలి. ఈ నెల 22 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

మధ్యలో చదువు మానేసినా..

విద్యార్థులు డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు పేరుతో సర్టిఫికెట్ అందజేస్తారు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసే వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్ల లోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశ పెట్టిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గత విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలవుతోంది.



సీట్ల కేటాయింపు

డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్మీడియెట్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి బీకాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. ఆర్ట్స్, హ్యుమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఏలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు. తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూపు పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ (అక్ను) పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ సాధారణ కోర్సులతో పాటుగా, కంప్యూటర్, మార్కెట్ ఓరియంటెడ్, స్కిల్ ఓరియంటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు aprche.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు దగ్గర్లో ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్‌కు చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకూ, కంప్యూటర్ కోర్సులకు రూ.8 నుంచి రూ.10 వేల వరకూ కోర్సును బట్టి ఫీజు ఉంటుంది.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు

జాతీయ విద్యా విధానం 2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశ పెట్టింది. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులను అమలు చేస్తున్నారు. ఈ కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీన్ని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టును మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంచుకుని చదువుకుంటాడు. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. తక్కువ ఫీజులతో, అన్ని రకాల సౌకర్యాలతో చదువుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కూడా ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో అత్యధిక మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు.

– డాక్టర్ కేసీ సత్యలత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం

అత్యున్నత ప్రమాణాలు



ఇంటర్, తత్సమాన విద్యార్హత ఉన్న వారు డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలన్నీ సమకూరాయి. అత్యున్నత ప్రమాణాలతో డిగ్రీ కళాశాలల్లో బోధన జరుగుతుంది. అన్ని కళాశాలల్లో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్స్ ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల, మండపేట

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులపైనా టీడీపీ నేతల కక్షసాధింపు


ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపురం: టీడీపీ నాయకుల కక్షసాధింపు చర్యలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. చివరకు పాఠశాలలో పని చేసే పారిశుధ్య కార్మికులపై కూడా వేధింపులకు పాల్పడుతున్నారు. మండలంలోని రాజంపాలెంలో జరిగిన ఈ ఘటన దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో సొంగా సుజాత, ఎస్.మంగ ఆరేళ్లుగా పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. అయితే వారు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా భావించి మంగళవారం విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ఆ పారిశుధ్య కార్మికులు కన్నీటిపర్యంతమయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమను వేధిస్తున్నారని వాపోయారు. ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా తమను విధుల నుంచి తొలగించి వేరే వ్యక్తులను నియమించారన్నారు. దీనిపై సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో జరిగే విషయాలపై తమకు ఎటువంటి సమాచారం లేకుండా చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని, అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే పంచాయతీకి పసుపు రంగు వేయడం, పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కమిటీలను మార్చడం, పారిశుధ్య కార్మికులను తొలగించడం శోచనీయమన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు కొత్త నిబంధనలు


పృథ్వీతేజ్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

సాక్షి, అమలాపురం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. కాబట్టి వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. లేకపోతే సంస్థ వెబ్‌సైట్ www.apeastempower.com నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గానీ, సంస్థ వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాస్‌కార్డులను వాడుకోవచ్చని తెలిపారు.

నాటు నాటు.. పనితీరు గ్రేటు..

- వరినాటు యంత్రంతో బోలెడు లాభాలు
- పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ
- కొత్త యంత్రాలెన్ని వచ్చినా దీని స్థానం పదిలం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు


ఆలమూరులో వరినాటు యంత్రం పనితీరుపై రైతుకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖాధికారి (ఫైల్)

పాడి-పంట


వరినాటు యంత్రం

ఆలమూరు: మనిషికి అన్నంపెట్టే వ్యవసాయానికి ఎల్లప్పుడూ గొప్ప స్థానం ఉంటుంది. ఎండనక, వానసక ఆరుగాలం కష్టబడి పనిచేసే రైతులు తమ కర్తవ్య పాలనలో అలుపెరగని ప్రయాణం సాగిస్తారు. లాభం వచ్చినా, నష్టమెచ్చినా ఉత్సాహంగా కొనసాగుతూనే ఉంటారు. ప్రకృతి వైపరీత్యాలు, కూలీల కొరత, దిగుబడులు, మద్దతు ధర.. ఇలా అన్ని దశలనూ దాటుకుంటూ ముందడుగు వేస్తారు. గతంలో వ్యవసాయంటే భారంగా ఉండేది. ముఖ్యంగా పెట్టుబడులు పెరగడంతో గిట్టుబాటు అయ్యేది కాదు. ఇప్పుడు సేద్యంలో అడుగడుగునా యంత్రాలు అండగా ఉంటున్నాయి.

అధునాతన యంత్రాలు

వ్యవసాయంలో అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. సాగు పనులలో రైతులకు చేదోడుగా ఉంటున్నాయి. వాటిని ఉపయోగించడం వల్ల పెట్టుబడులు, సమయం తగ్గడంతో పాటు దిగుబడులు కూడా ఆశాజనకంగా వస్తున్నాయి. ముఖ్యంగా కూలీల కొరతను ఎదుర్కోవడానికి రైతులకు సాయపడుతున్నాయి. తద్వారా పెట్టుబడిని ఆదా చేసుకుని, నాణ్యమైన దిగుబడులు సాధించే అవకాశం కలుగుతోంది. ఏమాత్రం కంగారు పడకుండా, వేగంగా పనులు చేసుకునే వీలు ఏర్పడుతోంది. అయితే వరి సాగుకు సంబంధించి ఎన్ని అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చినా, వరి నాటు యంత్రాలకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంది. వీటి పనితీరు, ఉపయోగాలను ఆలమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు వివరించారు.

సమయం ఆదా

ప్రస్తుతం డ్రమ్ సీడర్, శ్రీవరి సాగు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పాటు వరి నాటు యంత్రం (ఎస్ఎంఎస్ఆర్ఐ) ద్వారా చేపట్టే సాగు వల్ల రైతుకు అనేక ఉపయోగాలు కలుగుతాయి. సమయం, ఖర్చు బాగా ఆదా అవుతుంది. ఈ పద్ధతిలో ఎకరం పొలంలో కేవలం 12 నుంచి 15 కేజీల విత్తనం మాత్రమే అవసరమవుతుంది. వరి నారును ట్రేలలో పెంచి నేరుగా యంత్రం సహాయంతో పొలంలో నాట్లు వేస్తారు. వరి నాటు యంత్రాలను గత ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు అందించింది. ఈ యంత్రాలు నాలుగు, ఆరు, ఎనిమిది వరుసల్లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటి సామర్థ్యాన్ని బట్టి ఎకరం పొలంలో నాటేందుకు ఒక గంట నుంచి రెండు గంటల సమయం మాత్రమే పడుతుంది.

యాజమాన్య పద్ధతులు

- ఒక ఎకరాకు అవసరమయ్యే 12 నుంచి 15 కేజీల విత్తనాలను విత్తన శుద్ధి చేసిన తరువాత 24 గంటల పాటు నానబెట్టాలి.
- సీడింగ్ మెషీన్ సాయంతో ఏడు మిల్లీమీటర్ల మందం గల జల్లెడతో మట్టిని జల్లించి, దాన్ని ట్రేలలో నింపాలి.
- ట్రేలలో నింపిన మట్టిలో విత్తనాలను చల్లాలి. తరువాత పైన వర్మీకంపోస్టును పలుచగా వేయాలి.
- ప్రతి రోజూ క్యాన్లతో జాగ్రత్తగా నీటి తడులు ఇవ్వడం ద్వారా విత్తనాల నుంచి మొలకలు వస్తాయి.
- ఎకరా పొలంలో వరి నాట్లు వేసేందుకు 80 క్యాన్ల నీరు అవసరం అవుతుంది.
- ట్రేలలో నారు 15 రోజులలో నాటేందుకు సిద్ధం అవుతుంది. ఆ తర్వాత నారు ట్రేలను మెషీన్‌కు అమర్చాలి.

రైతులకు ప్రయోజనం



వరినాటు యంత్రాలతో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వరిసాగులో ఆధునిక పద్ధతులపై అన్నదాతలు దృష్టి సారించాలి. దీనివల్ల పెట్టుబడి ఆదాతో పాటు సమయం కలిసి వస్తుంది. వరినాటు యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మి లావణ్య, ఏఓ, ఆలమూరు

దమ్ము విధానం

పొలంలో ఐదు సెంటీమీటర్ల వరకూ నీరు నిల్వ ఉండేలా చూసుకుని ట్రాక్టర్ రోటా రీడర్ సహాయంతో దమ్ము చేయాలి. రోటా రీడర్ దుక్కుకు ముందు వేసవి దుక్కు అవసరం లేదు. దుక్కు పూర్తయిన తర్వాత బురద గొర్రు తోలాల్సిన పని కూడా ఉండదు. ఎందుకంటే రోహా రీడర్ వెనుక ఉండే బ్లేడు బురదను కూడా చదును చేస్తుంది. లేకపోతే పవర్ టిల్లర్‌తో దమ్ము చేసి, ఆశాజనక ఫలితాన్ని రాబట్టుకోవచ్చు.

దమ్ము తరువాత..

పొలంలో దమ్ము పూర్తయిన తర్వాత బరువు నేలల్లో అయితే 24 గంటలు, తేలిక నేలల్లో అయితే 12 గంటల పాటు స్థిరపడనివ్వాలి. అనంతరం పొలంలో వరినాటు యంత్రంతో నాటేందుకు వీలుగా కొద్దిపాటి నీటిని మాత్రమే ఉంచాలి. ఈ విధంగా చేయడం వల్ల యంత్రం పొలంలో సులువుగా తిరగడంతో పాటు కింది భాగంలో యంత్రానికి బురద అంటుకోకుండా ఉంటుంది. మొక్కకు మొక్కకు మధ్య 16 సెంటీమీటర్లు ఖాళీ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ విధానంలో ఎకరాకు సుమారు 80 ట్రేలు అవసరమవుతాయి.

ఉపయోగాలు

- విత్తనం వినియోగం తక్కువ
- కూలీల ఖర్చు ఆదా
- తెగుళ్ల ఉధృతి చాలా తక్కువ
- తక్కువ సమయంలో నాట్లు వేసుకునే అవకాశం
- నారుమడి యాజమాన్యంతో సమయం ఆదా

లంపకలోవ సొసైటీలో చోరీకి యత్నం


దొంగలు ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, కట్టర్


తెరచుకోని స్ట్రాంగ్ రూంలో లాకర్

- తెరచుకోని లాకర్
- పాత రికార్డుల దహనం

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)లో చోరీకి దొంగలు యత్నించారు. సొసైటీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సిబ్బంది సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని సొసైటీని యథావిధిగా మూసివెళ్లిపోయారు. మంగళవారం ఉదయం సొసైటీ ఉద్యోగి అడ్డాల శ్రీను వచ్చి చూసే సరికి తాళం బద్ధలు కొట్టి తలుపులు తెరిచి ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సొసైటీ వెనుక వైపు ప్రహరీపై ఉన్న ఇనుప తీగెలను కత్తిరించి, మేడపై ఉన్న సొసైటీ తాళాలను పగలకొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. స్ట్రాంగ్ రూం తాళం కూడా బద్ధలు కొట్టారు. లాకర్‌ను గ్యాస్ కట్టర్ ద్వారా కట్ చేసే ప్రయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో స్ట్రాంగ్‌రూంలో ఉన్న పాత రికార్డులను దహనం చేశారు. ఉత్తరకంచి స్టేట్ బ్యాంక్ దోపిడీకి పాల్పడిన తరహాలోనే ఇక్కడ కూడా చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. వారి ప్రయత్నం సఫలం కాకపోవడంతో గ్యాస్ సిలిండర్, కట్టర్‌ను అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. సొసైటీ సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ బీఎస్ శివకుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి ఎంఎస్‌జీ అవినాష్, ప్రత్తిపాడు డీసీసీబీ మేనేజర్ పీవీ రమణ తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సొసైటీ సీఈఓ ఒమ్మి కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా చోరీకి ఉపయోగించిన గ్యాస్ కట్టర్, సిలిండర్లను ప్రత్తిపాడులోని లారీ వెల్డింగ్ షాపు నుంచి తస్కరించినట్టు తెలిసింది. ఎస్సై ఎం. పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇదే సొసైటీలో చోరీ జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

అశ్రునయనాలతో సుభద్రమ్మ అంత్యక్రియలు


మాజీ మంత్రి వేణుకు ధైర్యం చెబుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, గణేష్ తదితరులు


కోటిలింగాలఘాట్‌లో మాజీ మంత్రి వేణును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్

- రామచంద్రపురం నుంచి రాజమహేంద్రవరం వరకూ అంతిమ యాత్ర
- కోటిలింగాల ఘాట్‌లో అంత్యక్రియలు
- మాజీ మంత్రి వేణుకు పలువురి పరామర్శ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాతృమూర్తి సుభద్రమ్మ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ముందుగా రామచంద్రపురంలోని స్వగృహం నుంచి రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లోని రోటరీ కైలాసభూమి వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. సుభద్రమ్మ చితికి మాజీ మంత్రి వేణు నిప్పంటించారు. ఆయన కుమారులు నరేన్, ఉమాశంకర్ పాడి మోశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ రామచంద్రపురం నుంచి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

పలువురి నివాళి

చెల్లుబోయిన సుభద్రమ్మ (94) సోమవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. కోటిలింగాల ఘాట్‌లో ఆమె భౌతిక కాయాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, రుడా మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం, పార్టీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), అమలాపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, పార్టీ జిల్లా వైఎస్సార్‌టీయూసీ, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, రాజమహేంద్రవరం రూరల్, రామచంద్రపురం నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు సందర్శించారు.

వేంకటేశ్వరా.. చూడవయ్యా..


వాడపల్లి వెంకన్న ఆలయ ఉత్తర ద్వారం

- వాడపల్లి ఆలయ డీసీ ఏకపక్ష నిర్ణయాలు
- ఉత్తర, దక్షిణ ద్వారాల మూసివేత
- భక్తుల ఆగ్రహంతో తెరచుకున్న వైనం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి నిరంతరం భక్తుల రద్దీ ఉంటుంది. అయితే డిప్యూటీ కమిషనర్ తీసుకున్న నిర్ణయాలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయి. ఆయన తీరుపై గ్రామస్తులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోయినా డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్ మంగళవారం భక్తుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ ఆలయ ఉత్తర, దక్షిణ ద్వారాలను మూసివేశారు. దీంతో స్వామివారి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో భక్తులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉత్తర, దక్షిణ ద్వారాలను తిరిగి తెరిపించారు. ఈ ఆలయానికి ప్రతి శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులు మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న డిప్యూటీ కమిషనర్ హోదాలో ఈఓ అయిన భూపతిరాజు కిషోర్ కుమార్ శైలిపై రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్, ఆర్‌జేసీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు భక్తులు, గ్రామస్తులు తెలిపారు. దీనిపై డీసీ కిషోర్ కుమార్ రాజును వివరణ కోరగా మంగళవారం భక్తుల తాకిడి పెద్దగా ఉండదని, కొత్తగా నిర్మాణం చేసిన మండపం కావడంతో కేవలం ట్రయల్ రన్ మాత్రమే చేయడం జరిగిందన్నారు. భక్తులకు స్వామివారి దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.40 లక్షల గోల్‌మాల్


జి.యర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్


జరిగిన మోసాన్ని వివరిస్తున్న డ్వాక్రా మహిళలు


బీసీ నానిబాబు ఇచ్చిన రశీదు

- జి.యర్రంపాలెం బ్రాంచ్‌లో ఘటన
- చేతివాటం చూపిన బీసీ నానిబాబు
- గగ్గోలు పెడుతున్న బాధితులు

రాజానగరం: జి.యర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో సుమారు 40 లక్షల మేరకు గోల్‌మాల్ జరిగింది. తాము కట్టిన సొమ్ములు అకౌంట్‌లో జమ కాలేదని నోటీసులు అందడంతో కొందరు ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి ఆరా తీయడంతో ఈ వ్యవహారం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో బ్యాంకులు గ్రామాలలో బిజినెస్ కరస్పాండెంట్లు (బీసీ)లుగా ప్రైవేట్ వ్యక్తులను నియమిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఇలాగే జి.యర్రంపాలెం బ్రాంచ్ కూడా నానిబాబు అనే వ్యక్తిని బీసీ నియమించి, ఖాతాదారులకు సేవలందిస్తోంది. సాధారణంగా వీరిని బ్యాంకు వెలుపల పనిచేసే విధంగా నియమిస్తారు. కానీ నానిబాబు కూడా బ్యాంకు ఉద్యోగులతో సమానంగా బ్యాంకులోనే పనిచేస్తుండటంతో ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొన్నాడు. దీనితో డ్వాక్రా సంఘాల సభ్యులతో పాటు బంగారు రుణాలు తీసుకున్న వారు తమ వాయిదాల సొమ్మును బ్యాంకు వచ్చి అతడికి ఇచ్చి రశీదు తీసుకునేవారు. అయితే బంగారు రుణాలు తీసుకున్న వారికి బకాయి ఉన్నట్టుగా నోటీసులు అందడంతో వారందరూ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే డ్వాక్రా సంఘాల సభ్యులు కూడా తమ ఖాతాలలో సొమ్ములు జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో పలువురు ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. కాగా ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ బీఎస్ రాజును వివరణ కోరగా సమాధానం చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తమపై అధికారులను కలసి సమాచారం తెలుసుకోమన్నారు.

- ఐదు నెలలుగా తమ సంఘం తరఫున రూ.1.20 లక్షలు చెల్లించామని, కానీ తమ బ్యాంకు ఖాతాలో ఆ సొమ్ములు జమ కాలేదని మేరీమాత మహిళా శక్తి సంఘానికి చెందిన కోనె లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. అంతకు ముందు తాము నేరుగా కట్టిన సొమ్ములు భద్రంగా జమయ్యాయని, బీసీ నానిబాబుకు చెల్లించిన సొమ్ములే జమ కాలేదని తెలిపింది. రూ.10 వేల లోపు చెల్లింపులన్నీ బీసీకే కట్టాలని బ్యాంకు సిబ్బంది కూడా చెప్పడంతోనే తాము అతనికి ఇచ్చామని వివరించింది.
- తమ సంఘం ద్వారా సంక్రాంతి తరువాత సొమ్ములు కట్టామని, కానీ ఖాతాలో జమ కాలేదని సుజాత మహిళ శక్తి సంఘానికి చెందిన దమ్ము దుర్గ వాపోయింది. రూ.60 వేలు కూడా పొదుపు ఖాతాలో జమ కాలేదని తెలిపింది.
- శారద మహిళ శక్తి సంఘం అధ్యక్షురాలు పి.పోశమ్మ, కార్యదర్శి వై.కల్యాణి కూడా తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం పొదుపు ఖాతాలో జమ చేసేందుకు బీసీ ప్రతినిధికి రూ.92 ఇచ్చామని, కానీ రూ.7 వేలు మాత్రమే జమ అయ్యిందన్నారు. రెండేళ్ల క్రితం రూ. 60 వేలు రుణం మంజూరైందని, ఆ తరువాత నుంచి పొదుపు సొమ్ము జమ కాలేదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


వినయ్ (ఫైల్)

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి గ్రామానికి చెందిన పిల్లి వినయ్(17) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా మోటార్ వేసే క్రమంలో తెగిపడిన విద్యుత్ తీగను పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వినయ్ కాకినాడలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. వినయ్ నేత్రాలను తండ్రి రామచంద్రరావు అనుమతితో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

సముద్రంలో పడి మత్స్యకారుడి మృతి

కొత్తపల్లి: వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ సముద్రంలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చొక్కా మసేను (53)తో పాటు మరో ఐదుగురు మత్స్యకారులు కారే రమణ బోటుపై మంగళవారం తెల్లవారుజామున వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా కెరటాల ఉధృతి కారణంగా మసేను ప్రమాదవశాత్తూ బోటుపై నుంచి సముద్రంలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిలాఫలకం ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్టు


శిలాఫలకం ధ్వంసం చేసిన భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక పంచాయతీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆవిష్కరించిన నవరత్నాలు శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు మంగళవారం అంగర ఎస్సై అందె పరదేశి తెలిపారు. గత నెల 30వ తేదీ రాత్రి సమయంలో పంచాయతీ కార్యాలయం పైన ఉన్న సచివాలయం గోడకు అమర్చిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో ఉన్న భాగాన్ని ముక్కలు చేసి కింద పడేశారు. తమ గ్రామంలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదంటూ సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యదర్శి చెముడు వీర వెంకట నరసింహారావు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండపేట సీఐ శ్రీధర్, అంగర ఎస్సై అందె పరదేశి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా.. నిందితులు అన్యం పురుషోత్తం, యర్రంశెట్టి రాజు, కామిశెట్టి సాయిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

కార్మికుల షెడ్డులో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

ఆత్రేయపురం: రాజవరం గ్రామంలో ఇటుక బట్టీ కార్మికులు ఉంటున్న షెడ్డులో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన గారపాటి సుబ్బారావు, గంగాధర్ ఈ బట్టీని నిర్వహిస్తున్నారు. ఈ ప్రమాదంలో షెడ్డులోని 18 గదుల్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని భావిస్తున్నారు.